నాయర్‌పై వేటు

దిలీప్, సోహమ్ దేశాయ్ రిలీవ్ ● గౌతం గంభీర్ సహాయక బృందం ప్రక్షాళన

ముంబై: అనుకున్నదే జరిగింది! నిరుడు స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో అవమానకర ఓటమితో పాటు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (ఆస్ట్రేలియాతో)లో టీమ్‌ఇండియా వైఫల్య ప్రదర్శన తర్వాత హెడ్‌కోచ్ గౌతం గంభీర్ కోచింగ్ బృందంపై వేటు తప్పకపోవచ్చునన్న పుకార్లను బీసీసీఐ నిజం చేసింది. గంభీర్ బృందంలో కీలకసభ్యుడిగా ఉన్న అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌పై వేటు వేసింది. నిరుడు కోల్‌కతా నైట్‌రైడర్స్ ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన తర్వాత అదే జట్టుకు మెంటార్‌గా ఉన్న గంభీర్‌ను టీమ్‌ఇండియాకు హెడ్‌కోచ్‌గా నియమించిన బీసీసీఐ.. నాయర్‌నూ గౌతీ బృందంలో చేర్చింది. కానీ టీమ్‌ఇండియా కోచింగ్ సభ్యుడిగా నాయర్ పదవీకాలం ఏడాది కూడా పూర్తికాకుండానే అతడిని తొలగించడం గమనార్హం. ఇక ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్‌తో పాటు స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్‌ను వారి బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. దిలీప్ జట్టుతో చేరి నిరుటికే మూడేండ్లు గడిచినా అతడి బాధ్యతలను మరో ఏడాది పాటు పొడిగించిన విషయం విదితమే. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌తో కీలక ఐదు టెస్టుల సిరీస్‌కు ముందే బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంగ్లండ్ సిరీస్‌కు 'జంబో సపోర్టింగ్ స్టాఫ్' అక్కర్లేదనే భావనలో ఉన్న బీసీసీఐ పెద్దలు.. గంభీర్ బృందానికి కత్తెర వేసినట్టు సమాచారం. నాయర్‌పై వేటు వేయడంతో బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కోటక్‌ను పూర్తి స్థాయిలో కొనసాగించనున్నట్టు బోర్డు వర్గాల వినికిడి. బౌలింగ్ కోచ్‌గా మోర్నీ మోర్కెల్ ఉండగా.. రియాన్ డస్కటె ఫీల్డింగ్ బాధ్యతలను చూసుకునే అవకాశముంది. 2002-03 దాకా సౌరవ్ గంగూలీ సారథ్యంలోని భారత జట్టుకు స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్‌గా పనిచేసిన అడ్రియన్ లె రౌక్స్ (దక్షిణాఫ్రికా) తిరిగి భారత జట్టుతో కలవనున్నట్టు సమాచారం. అడ్రియన్ ప్రస్తుతం ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు సేవలందిస్తున్నాడు.

అభిషేక్, నితీశ్‌కు బీసీసీఐ కాంట్రాక్టు!

ముంబై: భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మతో పాటు ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి, బౌలర్ హర్షిత్ రాణాకు బంపరాఫర్ దక్కనుంది. ఈ ముగ్గురూ ఈ ఏడాది బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులు అందుకోనున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఒక ఏడాదికాలంలో ఒక క్రికెటర్ మూడు టెస్టులు లేదా 8 వన్డేలు లేదా పది టీ20లు ఆడితే వాళ్లు నేరుగా గ్రేడ్- సీ కాంట్రాక్టును అందుకునే అవకాశముంది. దీని ప్రకారం చూసుకున్నా.. అభిషేక్ ఇప్పటిదాకా 17 టీ20లు ఆడగా అందులో నిరుటి సీజన్‌లో వరుసగా 12 మ్యాచ్‌లు ఆడాడు. నితీశ్.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్టుల లోనూ ఆడి అంచనాలకు మించి రాణించాడు. హర్షిత్ ఈ క్రైటీరియాలో తగిన మ్యాచ్‌లు ఆడకపోయినప్పటికీ అతడికీ కాంట్రాక్టు దక్కనున్నట్టు తెలుస్తున్నది. వీరితో పాటు టీ20లలో తనదైన బౌలింగ్‌తో రాణిస్తున్న మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (4 వన్డేలు, 18 టీ20లు) కూడా బీసీసీఐ కాంట్రాక్ట్ లిస్ట్‌లో చోటు దక్కించుకోనున్నట్టు సమాచారం. త్వరలోనే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడవనున్నాయి.

ముంబై మెరిసె

సమిష్టి ప్రదర్శనతో విజృంభణ

సన్‌రైజర్స్‌కు ఐదో ఓటమి

రాణించిన ఎంఐ బౌలర్లు

ముంబై: సీజన్ ఆరంభంలో వరుస ఓటములతో సతమతమైన ముంబై ఇండియన్స్ క్రమంగా పుంజుకుంటున్నది. ఇటీవలే ఢిల్లీ క్యాపిటల్స్‌తో అనూహ్య విజయం సాధించిన ఆ జట్టు.. గురువారం సొంత వేదికపై సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)నూ చిత్తు చేసింది. వాంఖడేలో జరిగిన పోరులో హైదరాబాద్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించి ఈ సీజన్‌లో మూడో విజయాన్ని నమోదు చేసింది. మొదట బౌలర్లు సమిష్టిగా రాణించి సన్‌రైజర్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయగా బ్యాటర్లు వేగంగా ఆడి ఆ జట్టును గెలిపించారు. స్వల్ప లక్ష్యాన్ని ముంబై 18.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విల్ జాక్స్ (26 బంతుల్లో 36, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), రికెల్టన్ (23 బంతుల్లో 31, 5 ఫోర్లు) రాణించారు. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్.. 20 ఓవర్లలో 162/5కే పరిమితమైంది. అభిషేక్ శర్మ (28 బంతుల్లో 40, 7 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా క్లాసెన్ (38) ఫర్వాలేదనిపించాడు. జాక్స్ (2/14)తో పాటు ఎంఐ పేసర్లు హైదరాబాద్‌ను కట్టడిచేశారు. విల్ జాక్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్‌కు ఇది ఐదో ఓటమి కావడం గమనార్హం.

ముంబై.. సాఫీగా

బ్యాటింగ్‌లో సన్‌రైజర్స్ తడబడ్డ పిచ్‌పై ముంబై మాత్రం అలవోకగా లక్ష్యాన్ని అందుకుంది. షమీ రెండో ఓవర్లోనే ఇంపాక్ట్ ప్లేయర్ రోహిత్ శర్మ (16 బంతుల్లో 26, 3 సిక్సర్లు) తనదైన ట్రేడ్ మార్క్ సిక్సర్లతో అలరించాడు. కమిన్స్ ఓవర్‌లోనూ స్క్వేర్ లెగ్ మీదుగా సిక్స్ కొట్టిన హిట్‌మ్యాన్.. అదే ఓవర్లో ఐదో బంతికి హెడ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మరో ఓపెనర్ రికెల్టన్ (31).. ఇషాన్ మలింగ బౌలింగ్‌లో వరుసగా మూడు బౌండరీలు బాదాడు. హర్షల్ 8వ ఓవర్లోనూ బ్యాక్‌టుబ్యాక్ బౌండరీలు కొట్టిన అతడు.. ఐదో బంతికి ఔట్ అయ్యాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన సూర్యతో జతకలిసిన జాక్స్.. ముంబై ఛేదనను వేగవంతం చేశాడు. ఈ ఇద్దరూ ఓవర్‌కు 10 పరుగులకు తగ్గకుండా ఆడటంతో లక్ష్యం క్రమంగా కరిగిపోయింది. మూడో వికెట్‌కు 29 బంతుల్లోనే 52 రన్స్ జోడించిన వీరిని కమిన్స్ విడదీశాడు. సూర్యతో పాటు జాక్స్ కూడా కమిన్స్ బౌలింగ్‌లోనే పెవిలియన్ చేరినా ముంబై పెద్దగా ఇబ్బందిపడలేదు. ఆఖర్లో కెప్టెన్ హార్దిక్(21), నమన్ ధీర్(0) వెంట వెంటనే ఔటైనా..సాంట్నర్(0)తో కలిసి తిలక్‌వర్మ(21 నాటౌట్) జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. కమిన్స్(3/26), మలింగ(2/36) ఆకట్టుకున్నారు.

స్లో బ్యాటింగ్.. నో హిట్టింగ్..

'ట్రావిషేక్'.. ఈ జోడీ పేరు చెబితేనే ప్రత్యర్థులకు దడ. ఇన్నింగ్స్ తొలి బంతి నుంచే విధ్వంస రచనను మొదలుపెట్టే ఈ జంట.. మందకొడి వాంఖడే పిచ్‌పై మాత్రం అంచనాలను అందుకోలేక చతికిలపడింది. వీలైనన్ని ఎక్కువ రన్స్ రాబట్టే పవర్ ప్లేలో.. హైదరాబాద్ చేసింది 46 పరుగులే. 8 ఓవర్ల దాకా క్రీజులో అభిషేక్, హెడ్ ఉన్నా స్కోరు వేగం పుంజుకోలేదు. ఇన్నింగ్స్ తొలి బంతికే విల్ జాక్స్ క్యాచ్ జారవిడవడంతో లైఫ్ లభించిన అభిషేక్.. చాహర్ ఐదో ఓవర్లో హ్యాట్రిక్ బౌండరీలతో అలరించాడు. కానీ మరో ఎండ్‌లో హెడ్ మాత్రం ముంబై బౌలర్లను ఎదుర్కోవడానికి తంటాలు పడ్డాడు. హార్దిక్ 8వ ఓవర్లో బంతినందుకుని.. అభిషేక్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ సెంచరీ మినహా చెత్తగా ఆడుతున్న ఇషాన్ కిషన్ (2) ఆటతీరు మారలేదు. హార్దిక్ 10వ ఓవర్లో 'నో బాల్' అండతో ఔట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న హెడ్.. దానిని సద్వినియోగం చేసుకోలేదు. హెడ్ 12 ఓవర్ల పాటు క్రీజులో ఉన్నా అతడి ఆట సహజశైలికి భిన్నంగా సాగింది. 29 బంతుల్లో 28 పరుగులు చేసిన హెడ్‌ను జాక్స్ బోల్తా కొట్టించాడు. జాక్స్‌తో పాటు ముంబై పేసర్లు మధ్య ఓవర్లలో ఎస్ఆర్‌హెచ్‌ను కట్టడిచేశారు. నితీశ్ (19) మళ్లీ విఫలమవగా.. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన క్లాసెన్.. చాహర్ 18వ ఓవర్లో 6 (హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో ఇదే తొలి సిక్సర్), 4, 4, 6తో 21 రన్స్ రాబట్టాడు. ఆఖర్లో అనికేత్ (18 నాటౌట్) మెరుపులతో హైదరాబాద్ ఆ మాత్రం స్కోరైనా సాధించింది.



సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 162/5 (అభిషేక్ 40, క్లాసెన్ 37, జాక్స్ 2/14, బుమ్రా 1/21); **ముంబై:** 18.1 ఓవర్లలో 166/6(జాక్స్ 36, రికల్టన్ 31, కమిన్స్ 3/26, మలింగ 2/36)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
ఢిల్లీ	6	5	1	10	0.74
గుజరాత్	6	4	2	8	1.08
బెంగళూరు	6	4	2	8	0.67
పంజాబ్	6	4	2	8	0.17
లక్నో	7	4	3	8	0.08
కోల్‌కతా	7	3	4	6	0.54
ముంబై	7	3	4	6	0.23
రాజస్థాన్	7	2	5	4	-0.71
హైదరాబాద్	7	2	5	4	-1.21
చెన్నై	7	2	5	4	-1.27

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

ప్రపంచ బిలియర్డ్స్ చాంప్ సౌరవ్

ఫైనల్లో పంకజ్ అద్వానీపై విజయం

న్యూఢిల్లీ: ఐర్లాండ్ వేదికగా జరిగిన ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ టోర్నీలో భారత స్టార్ క్యూయిస్టు సౌరవ్ కొఠారీ చాంపియన్‌గా నిలిచాడు. గురువారం జరిగిన ఫైనల్లో సౌరవ్ 725-480 పాయింట్ల తేడాతో ఏస్ క్యూయిస్టు పంకజ్ అద్వానీపై అద్భుత విజయం సాధించాడు. ఇటీవలి చాంపియన్‌షిప్ చరిత్రను పరిశీలిస్తే..ఏకంగా 325 పాయింట్లతో సౌరవ్ అద్భుతమైన బ్రేక్ సాధించాడు. ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వని సౌరవ్ 119, 112 స్కోర్లతో గేమ్‌పై పట్టు నిలబెట్టుకున్నాడు. ఈ క్రమంలో తన కెరీర్‌లో తొలిసారి ఐబీఎస్ఎఫ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. సరిగ్గా 35 ఏండ్ల క్రితం సౌరవ్ తండ్రి, దిగ్గజ క్యూయిస్టు మనోజ్ కొఠారీ ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఇదిలా ఉంటే ఐబీఎస్ఎఫ్ టైటిల్‌తో పాటు డబ్ల్యూబీఎల్ వరల్డ్ బిలియర్డ్స్ టైటిళ్లు గెలిచిన మూడో భారత ప్లేయర్‌గా సౌరవ్ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు.

విజయంతో ఆరంభం

ఢిల్లీ: డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా 2025 సీజన్‌ను గెలుపు త్రోతో ఆరంభించాడు. దక్షిణాఫ్రికాలోని పోచెఫ్‌స్ట్రామ్‌లో జరుగుతున్న వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ చాలెంజర్ ఈవెంట్‌లో భాగంగా బుధవారం జరిగిన జావెలిన్ త్రో ఫైనల్‌లో నీరజ్.. 84.52 మీటర్ల త్రో తో మొదటి స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో ఆరుగురు పోటీపడగా నీరజ్‌కు అగ్రస్థానం.. దక్షిణాఫ్రికాకే చెందిన డౌ స్మిత్ (82.44 మీటర్లు) రెండో స్థానం దక్కించుకున్నాడు. వచ్చే నెల 16 నుంచి దోహాలో జరుగబోయే డైమండ్ లీగ్ సన్నాహకాల్లో ఉన్న నీరజ్.. ఈ సీజన్‌లో 90 మీటర్ల మార్కును అందుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు.

ఢిల్లీ బౌలింగ్ కోచ్‌కు జరిమానా

ఢిల్లీ: అత్యంత ఉత్కంఠ నడుమ జరిగిన రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ సూపర్ ఓవర్ తర్వాత ఢిల్లీ బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్‌కు బీసీసీఐ షాకిచ్చింది. అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించింది. మునాఫ్‌పై జరిమానా ఎందుకు వేసిందన్న విషయాన్ని బీసీసీఐ స్పష్టంగా వెల్లడించకపోయినప్పటికీ మ్యాచ్ సందర్భంగా అతడు ఫోర్త్ అంపైర్‌తో వాగ్వాదానికి దిగినందుకే జరిమానా పడినట్టు తెలుస్తున్నది. ఆటగాళ్లకు ఓ సందేశం ఇవ్వడానికి గాను ఢిల్లీ రిజర్వ్ ఆటగాడిని మైదానంలోకి వెళ్లాలని మునాఫ్ సూచించగా అక్కడే ఉన్న అంపైర్ అందుకు నిరాకరించాడు. దీంతో మునాఫ్ అంపైర్‌తో వాగ్వాదానికి దిగిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.

భారత్‌కు కాంస్యాలు

న్యూఢిల్లీ: సౌదీ అరేబియా వేదికగా జరుగుతున్న ఏషియన్ అండర్-18 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత పతక జోరు కొనసాగుతున్నది. పోటీలకు మూడో రోజైన గురువారం భారత ఖాతాలో మరో రెండు కాంస్య పతకాలు చేరాయి. బాలికల అండర్-18 డిస్కస్‌త్రో ఈవెంట్‌లో లక్షిత మహ్లావత్ 41.30మీటర్ల దూరం విసిరి కాంస్యం సొంతం చేసుకుంది. బాలికల 100మీటర్ల హర్డిల్స్‌లో శౌర్య అంబురె 13.80సెకన్ల టైమింగ్‌తో కాంస్యం కైవసం చేసుకుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.